అభివృద్ధిని చూసి చేరికలు

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ పేట జిల్లా అధ్యక్షుడు

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిట్టె రామ్మోహన్‌రెడ్డి

మక్తల్‌టౌన్,అక్టోబర్18:త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపులో భాగస్వాములై బంగారు తెలంగాణ సాధనలో కంకణ బద్ధులు కావాలనే వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బహుజన సమాజ్‌వాదీ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత మండల విద్యాధికారి గుడిగంగ్ల లక్ష్మీనారాయణ బుధవారం ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మందికి ఓనమాలు నేర్పిన లక్ష్మీనారాయణ ఉద్యోగానికి రాజీనామచేసి బీఎస్పీలో చేరారని అన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధిలో భాగస్వాములై తెలంగాణ అభివృద్ధిలో కలిసి నడవాలనే లక్ష్యంతో బీఎస్పీని వీడి బీఆర్ఎస్‌లోకి రావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాబోయే తరానికి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధిలో పాలు పంచుకోవాలనే లక్ష్యంతో బీఆర్ఎస్‌లో చేరానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డా.ఆంజనేయ గౌడ్, ఊట్కూర్ జెడ్పీటీసీ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చిట్టెం విజయానికి కృషి చేయాలి

- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డా.ఆంజనేయగౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న అంజనేయ గౌడ్

నర్వ, అక్టోబర్18:మక్తల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేయాలని మక్తల్ నియోజకవర్గం ఇన్‌చార్జి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్. ఆంజనేయ గౌడ్ దిశ నిర్దేశం చేశారు. బుధవారం నర్వ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మండల నాయకులు,కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. చిట్టెం గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి రైతును రాజుగా చేసేందుకు గతంలో ఏ ప్రభుత్వం చేపట్టలేని సంక్షేమం కేసీఆర్‌తో సాధ్యమైందని వివరించారు. కేసీఆర్ సంక్షేమ పథకాలే మనకు శ్రీరామ రక్ష అని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గతం కంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. మండలంలోని రాజకీయ పరిస్థితులు, బలా బాలాలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు దండు అయ్యన్న, హన్మంతొడ్డి, శంకర్, చిన్నయ్య, శేఖర్ యాదవ్, వేంకటేశ్వర్‌రావు, వెంకటన్న రాములు, శివ, నాగరాజు, బి.కే.నర్సింహులు తదితరులు ఉన్నారు.

జములమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మక్తల్ అర్బన్, అక్టోబర్18: పట్టణంలోని యాదవ్‌నగర్ శివారులో బుధవారం జములమ్మ ఆలయ నిర్మాణానికి ఆలయకమిటీ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జములమ్మ దాతలు వెంకటేశ్, మనసాని కిరణ్, మామిళ్ల రాజవర్ధన్ సహకారంతో జములమ్మ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మామిళ్ల కిష్టప్ప, గుంతలి శివకుమార్, బుగ్గప్ప, అర్చకులు శ్యాంసుందర్‌జోషి పాల్గొన్నారు.

టెంకాయ, లడ్డూ విక్రయానికి వేలం

వేలం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మక్తల్ అర్బన్,అక్టోబర్18: పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో టెంకాయలు, లడ్డూ, పులిహోర విక్రయాల కోసం బుధవారం వేలం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో ఒక సంవత్సరం గాను టెంకాయలు, లడ్డూ, పులిహోర విక్రయనికి వేలం నిర్వహించగా టెంకాయలను మక్తల్‌కు చెందిన డీ.లక్ష్మి రూ.3,91,000 దక్కించుకుంది. ప్రసాదాలు రూ.70,600కు కాకర్తపాడు గ్రామస్తుడు వీరాంజనేయులు దక్కించుకున్నారు అని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ దర్మకర్త భీమాచారి, ఆలయ అర్చకులు ప్రాణేశ్ చారి, అరవింద్ ఆలయ సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

బతుకమ్మలతో వస్తున్న విద్యార్థినులు

మాగనూర్, అక్టోబర్ 18: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళశాలలో బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.అదేవిదంగా మండల పరిధిలోని పెగడబండ గ్రామంలో మహిళలు బతుకమ్మ పండగను కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో రేణుకాదేవి, రామస్వామి,రమేశ్, ప్రదీప్, గుండేరావు, సమంత, శ్రీకాంత్, కవిరాజు, సుదర్శన్ కళా శాల సిబ్బంది బాల్ రాజు, నవీన్, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవీగా దర్శనమిచ్చిన అమ్మవారు

అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న భక్తులు

అమరచింత, అక్టోబర్18: మండల కేంద్రంలోని కాళికామాత ఆలయంతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయ వద్ద నెలకొల్పిన అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆత్మకూర్‌లో...

ఆత్మకూరు, అక్టోబర్ 18: మండలం వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల్లో దుర్గామాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటుచేసిన మండపం వద్ద ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు అన్నదానం ఏర్పాటు చేశారు. స్వర్ణకార సంఘం మండపంలో మహిళలు కుంకుమార్చన చేశారు. హనుమాన్ గుడిలోని స్ఫటిక లింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన మండపంలో పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కోట్ల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మహిళలు పెద్దసంఖ్యలో బతుకమ్మలు ఆడిపాడారు. పూజా కార్యక్రమాల్లో ఆయా దేవాలయాల ఉత్సవ కమిటీల ప్రతినిధులు, సద్భక్త బృందాలు పాల్గొన్నారు.

కాత్యాయనీ దేవీగా...

మక్తల్ అర్బన్,అక్టోబర్18: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవీ ఆలయంలో వాసవీ అమ్మవారు భక్తులకు కాత్యాయని అలంకరణ రూపంలో దర్శమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా సాయంత్రం బతుకమ్మ, కుంకుమర్చణ, పల్లకీ సేవ, అశ్వవాహన సేవ రతోత్సవం, పిల్లలకు గేమ్స్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి అధ్యక్షులు కట్టా సురేష్, మనసాని వెంకటేష్, లక్ష్మణ్, స్వామి, శరణ్, సుజిత్, కిరణ్, రంజిత్, వెంకటేష్, అనుగొండ శ్రీనివాస్, తిరుపతి, మహిళా సంఘం అధ్యక్షురాలు బొరిశెట్టి పద్మ, మీరా బాయి సుష్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

ఆత్మకూరు, అక్టోబర్ 18: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అప్పగించారు. మండలంలోని ఆరెపల్లికి చెందిన వడ్డెవాటి రాంచందర్ ఆగస్టు 30న ఆత్మకూరు నుంచి ఆరెపల్లికి బైక్‌పై వెళ్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోగా పోలీసులు హైదరాబాద్‌లోని బోరబండలో సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. బుధవారం ఎస్సై నరేందర్ బాధితుడు రాంచందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగలించబడ్డా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే వీలైనంత త్వరగా గుర్తించి రికవరీ చేయనున్నట్లు తెలిపారు.

యువకుడికి గాయాలు

ఆత్మకూరు, అక్టోబర్ 18: పోలీస్‌స్టేషన్‌లో యువకుడికి గాయాలైన ఘటన పట్టణంలో చోటుచేసుకున్నది. మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన ఢాకమ్మ బుధవారం తన కొడుకు నుంచి రక్షించాలంటూ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు ఢాకమ్మ కుమారుడు విజయ్‌ని ఠాణాకు రప్పించారు. ఇంటి జాగా విక్రయించే విషయంలో తన మాట వినకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చిందనే కోపంతో విజయ్ మద్యం మత్తులో ఠాణాలోనే తల్లిపై దాడిచేసేందుకు యత్నించగా కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. ఈ క్రమంలో విజయ్ కాలు జారి కిందపడడంతో తలకు గాయమైంది దీంతో పోలీసులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించినా మద్యం మత్తులో చికిత్స చేయించుకునేందుకు నిరాకరించడంతో ప్రజా ప్రతినిధులు కలుగజేసుకొని వైద్యం అందేలా చేశారు.

బెల్ట్ షాపుపై దాడి, మద్యం సీజ్

అమరచింత, అక్టోబర్ 18: మండల పరిధిలోని చంద్రనాయిక్‌తండాలో బుధవారం బెల్టు షాపులపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన మదాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు.